క్లుప్తంగా

డీఐజీని కలిసిన మాదిగ కార్పొరేషన్ చైర్మన్



ఏలూరురేంజ్ డీఐజీ పాలరాజును మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు తదితరులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు రేంజ్ డీఐజీ జి.పాలరాజును రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏలూరు విచ్చేసిన కనకారావు డీఐజీని కలిసి కొద్ది సేపు ఏలూరు రేంజ్ పరిధిలోని మాదిగల సమస్యలపై మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాదిగల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న విషయాన్ని గుర్తు చేసారు. రేంజ్ పరిధిలో మాదిగలపై జరుగుతున్న దాడుల్లో సత్వర న్యాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా డీఐజీ పాలరాజుకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సీనియర్ ఎస్సీ నాయకులు పాలిమేర హరికృష్ణ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ రాష్ట్ర నాయకులు పాకా ప్రభాకర్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కోటదిబ్బ విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్) : విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని శనివారం ధర్నా నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు కోటదిబ్బ విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద ఈ కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు ప్రతీ నెల ఒకటవ తేదీన పెన్షన్ వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. 2018 జూలై1 నుంచి రావాల్సిన రెండు డీఆర్ఏ బకాయిలు తక్షణం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం తహసీల్దార్, ఏటిఓ కి సమస్యలతో కూడిన విజ్ఞాపన పత్రం అందజేశారు. జిల్లా నాయకులు కె.మహాలక్ష్మి, డి.గంగాధర్, ఆర్ వెంకటేశ్వర్లు, ఎల్ పాండురంగారావు, ఎన్వి మధుసూధనరావు, ఏలూరు నగర పాలక సంస్థ విశ్రాంత ఉద్యోగులు ఎ.అప్పలరాజు, పివిరమణ, ఎస్ఎంవి సుబ్బారావు, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకు 'వైద్యం'

- పేదల పాలిట వరంగా 'ఫ్యామిలీ డాక్టర్'
- గ్రామాల్లోని పేదలకు ఉచిత వైద్య పరీక్షలు
- ఏలూరు నియోజకవర్గంలో 10వేల మందికి లబ్ధి



తంగెళ్లమూడిలో వృద్ధురాలు షేక్ భానుబీ ఇంటివద్దనే పరీక్షలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ దేవిడ్‌రాజు, వైద్య సిబ్బంది



ఏలూరు నియోజకవర్గం కాట్లంపూడిలో ఇంటివద్దకే వైద్యసేవలు

ఏలూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం పేదల పాలిట వరంగా మారింది. గ్రామాల్లో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు విద్య, వైద్యం, ఉచితంగా అందించాలనే ఉన్నత లక్ష్యంతో పనిచేస్తోన్న తరుణంలో గ్రామాల్లో ఇంటి ముంగిటకే వైద్య సేవలు అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు, ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణులు, బాలింతలకు పరీక్షల నిమిత్తం గతంలో పట్టణాలకు వెళ్లేవారు, ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం అమలులోకి వచ్చిన తరువాత నిర్దేశిత సమయంలో రోగుల ఇళ్ల వరకు వైద్యులు వచ్చి పరీక్షలు చేసి మందులులు అందిస్తున్నారు. ఒకప్పుడు ఏ చిన్న జబ్బు చేసినా, పెద్ద అనారోగ్యం వస్తే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పట్టణాలకు పరుగుపెట్టేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నిర్దేశిత సమయంలో గ్రామాల్లో వైద్య బృందాలు రోగులను నిశితంగా పరీక్షలు చేస్తూ... మందులు ఉచితంగా అందిస్తున్నారు. గ్రామాల్లో ఈ వైద్య సేవలకు విశేష స్పందన కనిపిస్తోంది. ఏలూరు నియోజగకవర్గంలో ఏలూరు నగరంతో పాటు శనివారపుపేట, సత్రంపాడు, వట్లూరు, చొదిమెళ్ల, వెంకటాపురం, పాలగూడెం, చాటపర్రు, కాట్లంపూడి, లంక గ్రామాల్లోనూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. సుమారుగా 350 వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో 22,509 మందికి వైద్య సేవలు పొందారు. దీంతో పేదలు ఆరోగ్యంపై భరోసా కలిగింది. మాకు ఏజబ్బు చేసినా ప్రభుత్వం ఉందిలే అన్న ధీమా కనిపిస్తోంది.

షుగర్, బీపీ రోగులకు భరోసా : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ వంటి రోగాలు పట్టిపీడిస్తున్నాయి. పేద ప్రజలు వీటికి వైద్యం చేయించుకోలేక, మందులు కొనుగోలుకు డబ్బులు లేక ప్రాణాలు మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వమే వైద్యులను ఏకంగా ఇంటికి పంపి మరీ ప్రతీ నెలా రక్తం, యూరిన్ పరీక్షలు చేయిస్తోంది. నెలనెలా ఏమైనా ఆరోగ్య సమస్యల్లో తేడాలు ఉన్నాయా ? అనేది కంప్యూటర్‌లో రోగి వివరాలు నమోదు చేసి పర్యవేక్షిస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఏలూరు నియోజకర్గంలో 9,840 మంది బీపీ, షుగర్ రోగులకు సేవలు అందుతున్నాయి.

ఇంటి వద్దనే వైద్యసేవలు భేష్

ప్రతి నెలా వైద్య బందం మా ప్రాంతానికి వస్తున్నారు. రక్త, యూరియా పరీక్షలు చేయటంతో పాటు మందులు ఇస్తున్నారు. ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే వస్తున్నారు. బీపీ, షుగర్ పరీక్షలు చేస్తూ నెలకు సరిపడా మందులు ఉచితంగా ఇచ్చి వెళ్లుతున్నారు. నేను పెద్దాసుపత్రికి వెళ్ళి నిలబడి వైద్యం, పరీక్షలు చేయించుకునే పరిస్థితి లేకుండా ఇంటికే రావటం సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– షేక్ భానుబీ (85), తంగెళ్లమూడి, ఏలూరు

మెరుగైన వైద్యసేవలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం తేవటంతో పేదవర్గాలకు మేలు జరుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న విలేజీ, హెల్త్ క్లీనిక్‌లకు వైద్యాధికారులు, ఎఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశ వర్కర్లు అందుబాటులో ఉన్నారు. ముఖ్యంగా షుగర్, బీపీని రోగులకు సేవలు అందించటడే కాకుండా గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

– డాక్టర్ సీహెచ్ చక్రధర్, పీహెచ్‌సీ వైద్యాధికారి

రోగుల వివరాలు కంప్యూటర్లో..



ఏలూరు పరిధిలోని పలు గ్రామాల్లోనూ ఫ్యామిలీ వైద్యుడు విధానం అమల్లో ఉంది. 104 సంచార వైద్యశాలలో ప్రత్యేకంగా ఇద్దరు వైద్యులు, ఆరోగ్య సిబ్బందితో నెలలో రెండుసార్లు గ్రామాల్లో వైద్య పరీక్షలు, మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేస్తోంది. రోగుల వివరాలు కంప్యూటర్ పొందుపరచటంతో ఆరోగ్య వివరాలు వైద్యులకు పూర్తిస్థాయిలో అవగాహన ఉంటుంది.

– జీవీఎల్ భానుచందర్, డేటాఎంట్రీ ఆపరేటర్, ఏలూరు

సీతారాముల కల్యాణానికి స్పెషల్ బస్ సర్వీసులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా భద్రాచలంలో నిర్వహించే సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరయ్యే భక్తుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి ఈ స్పెషల్ బస్ సర్వీసులు ఈ నెల 29వ తేదీన భక్తులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఏలూరు డిపో నుంచి ఉదయం 7 గంటలకు, తిరిగి రాత్రి 10 గంటలకు రెండు బస్సులు ఏర్పాటు చేశామని, ఏలూరు నుంచి ఛార్జీగా రూ. 275 నిర్ణయించామన్నారు. అలాగే జంగారెడ్డి గూడెం నుంచి రాత్రి 7 గంటలకు బస్సు ఏర్పాటు చేశామని, రూ. 175 ఛార్జీగా నిర్ణయించామన్నారు. నూజివీడు డిపో నుంచి రాత్రి 10 గంటలకు ఒక బస్సు బయలుదేరుతుందని రూ. 220 ఛార్జీగా నిర్ణయించామన్నారు. అలాగే ఏదైనా గ్రామం నుంచి 40 మందికి మించి భక్తులు ఉంటే అక్కడి నుంచి స్పెషల్ బస్సులు ఏర్పాటు చేస్తామని దీని కోసం భక్తులు సంబంధిత డిపో మేనేజర్‌ను సంప్రదించాల్సినారు.

29న అమ్మవారి చీరల వేలం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పత్తేబాదలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవికల ముక్కలను ఈ నెల 29వ తేదీన వేలం వేయనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి డీ. శంకర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ వేలం ప్రక్రియ దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో జరుగుతుందని, ఆసక్తి కలిగిన భక్తులు వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కు అభినందనలు



ఎమ్మెల్సీగా విజయం సాధించిన కవురు శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నికైన జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌ను పలువురు జెడ్పీటీసీలు, అధికారులు అభినందించారు. పుష్పగుచ్ఛాలు అందజేసి కవురు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ఏడాదిన్నర కాలం పాటు జెడ్పీ చైర్మన్‌గా సేవలు అందించిన తనకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఎంతో సహకరించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీచేసి గెలుపొందడం జరిగిందన్నారు. ఈ విజయానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తదితర ప్రజాప్రతినిధులు ఎంతో సహకరించారన్నారు. రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు తదతర్ల అందరి ఆశీస్సులతో ఎమ్మెల్సీగా విజయం సాధించగలిగామన్నారు. మే మొదటి వారంలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయవలసి ఉంటుందన్నారు. ఈ లోగా ఏప్రిల్ మొదటి వారంలో జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించి జిల్లా అభివృద్ధికి, వివిధ సమస్యల పరిష్కారానికి సమగ్రంగా సమీక్షించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్లు పోసిన శ్రీలేఖ, పెనుమాల విజయబాబు, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, పలువురు జెడ్పీటీసీలు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో అలౌకిక ఆనందం



ఇమామ్, మౌజన్‌లను సత్కరిస్తున్న ఎస్ఎంఆర్ పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానవజన్మలో ఆధ్యాత్మిక చింతనతో అలౌకిక ఆనందం కలుగుతుందని ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు తెలిపారు. రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో నగరానికి చెందిన అహలె సున్నత్ వల్ జమాత్ సంస్థ ఆధ్వర్యంలో గత ఏడాది కాలంగా వివిధ సున్నీ మసీదుల్లో ఆధ్యాత్మిక సేవలందిస్తున్న పేష్ ఇమామ్, మౌజన్‌లను సన్మానించారు. స్థానిక గొలుసుల పంజాలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పెదబాబు మాట్లాడుతూ ఏడాది పొడవునా మసీదుల్లో నమాజ్ ప్రార్థనలు చేస్తూ, ఆధ్యాత్మిక ప్రసంగాలతో దేవుని సేవలో తరిస్తున్న వారిని సన్మానించడం అభినందనీయమన్నారు. ప్రతీ వ్యక్తి తన తోటి వారిని సోదరభావంతో ఆదరిస్తూ వారివారి మత విశ్వాసాలను గౌరవిస్తూ శాంతి స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏలూరు నగరంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు ఇలా అనేక మతాల వారు జీవిస్తున్నా సర్వమత సహనం పాటిస్తూ నగరంలో ఆహ్లాదకర వాతావరణాన్ని స్థాపించారని ప్రశంసించారు. ఈ సందర్భంగా నగరంలోని 12 సున్నీ జమాత్ మసీదుల్లో పని చేస్తున్న ఇమామ్, మౌజన్‌లను సత్కరించి జ్ఞాపికలు అందచేశారు. అనంతరం నిర్వహించిన అన్న సమారాధనలో ముస్లిం సోదరులు అల్లా ప్రసాదం స్వీకరించారు. అహలే సున్నత్‌వల్ జమాత్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే సాబిర్ హుస్సేన్, ఎండీ గాలబ్ అలీ, గౌరవాధ్యక్షుడు ఎండీ ఇమామ్, ప్రతినిధులు ఎండీ ఎగ్బాల్, ఎస్‌కే షరీఫ్, అస్లాం అలీ భాషా, అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ అధ్యక్షుడు ఎండీ సులేమాన్‌ఎస్‌కే ఇస్మాయిల్, ఎండీ అబ్బు భాయ్, ఎండీ దౌలా తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	50
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	48-72
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	08-10
బెండకాయలు	44	కంద	46
పచ్చిమిర్చి	36	బీట్‌రూట్	34
కాకర కాయలు	34-40	కీరా దోస	36
బీరకాయలు	32	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	50	అల్లం	90
క్యాబేజీ	20	కొత్తిమీర (కట్ట)	12
క్యారెట్	28	పాలకూర	10
దొండకాయలు	38	చుక్కకూర	10
బంగాళదుంపలు	20	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	30-36	బజ్జీ	76
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	08
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	08
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	07
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

పే బ్యాక్ టు సొసైటీ కోసం కృషి చేయాలి



స్థానిక ఎన్ఆర్‌పేటలోని ఏఐఏవైఎస్, ఎస్సీఆర్‌పీఎస్ కార్యాలయంలో సంతోష్ కుమార్ తదితరులు

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన విధంగా పే బ్యాక్ టు సొసైటీ కోసం నేటితరం ఉద్యోగులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఏఐఏవైఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ పిలుపు నిచ్చారు.1956 మార్చి 18న ఆగ్రాలో నిర్వహించిన ఉద్యోగుల సదస్సులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన పిలుపును గుర్తు చేస్తూ స్థానిక ఎన్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో అంబేడ్కర్ ఇచ్చిన ఆదేశాలు నేటి ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులు నిర్వహిస్తున్న తీరు అనే అంశంపై శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ సర్వజనాల కోసం పోరాటం చేశారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్ల హక్కుతో ఉద్యోగం సంపాదించిన వారు ఆయన ఇచ్చిన ఆదేశాలను పాటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొరబండి బాబూరావు, పల్లా యేసేబు,కనికెళ్ళి రవిప్రసాద్, వెంపా నాగరాజు, బి.నాగరాజు, బి.వెంకయ్య పాల్గొన్నారు.

మార్చి 20న చలో విజయవాడ



వామపక్షాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్): భావ ప్రకటన స్వేచ్ఛను హరించే జీవో నెంబర్ ఒకటి రద్దు చేయాలని కోరుతూ మార్చి 20న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ఆరోజు జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వామపక్షాలు, ప్రజా సంఘాలు తెలిపాయి. స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి, సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను, ప్రాథమిక హక్కులను హరించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు ఒకటి రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో ర్యాలీలు, సభలను నిషేధిస్తూ జీవో నెంబరు ఒకటి విడుదల చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు కాకర్ల అప్పారావు, సీపీఎం నగర కార్యదర్శి పి.కిషోర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, పివి రామకృష్ణ, వి.శైలజ, పి.ఆదిశేషు, కె.విజయభాస్కర్, బళ్ళ కనకదుర్గారావు, కొడేటి బేబీ, పౌరహక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి రత్నం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, దిశ యాప్‌పై అవగాహన

దెందులూరు: విద్యార్థులు సైబర్ నేరాలు, దిశ యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సోషల్ మీడియాలో వార్తలు పట్ల అవగాహన పెంపొందించుకోవాలని గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యాకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నత్తానియేల్ అన్నారు. శనివారం కళాశాలలో సైబర్ నేరాలు, దిశా యాప్‌పై వ్యాయామ విద్యార్థులకు అవగాహన కల్పించారు. టెక్నాలజీని విజ్ఞానానికి పరిధిలో ఉపయోగించుకోవాలని సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. గ్రామ మహిళా పోలీస్ కనకదుర్గ చట్టాలు, నేరాలు, శిక్షలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎం బేబి నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పీడీకేడీ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్ రమేష్, ఫిజికల్‌డైరెక్టర్లు డాక్టర్ శ్యామల, జయలక్ష్మి ఉన్నారు.

పాటెమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పూజలు



చల్లచింతలపూడి పాటెమ్మ తల్లి ఆలయంలో పూజలు చేస్తున్న కొఠారు రామచంద్రరావు

దెందులూరు: చల్లచింతలపూడిలోని నూతనంగా నిర్మించిన ఆలయంలో శనివారం పాటెమ్మ తల్లి విగ్రహావిష్కరణ, నూతన ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. యలమర్తి వారి ఆడపడుచు, ఇలవేల్పు అయిన పాటెమ్మ తల్లి విగ్రహానికి తొలుత అర్చకులు, యలమర్తి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, చల్లచింతలపూడి సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, మాజీ సర్పంచ్ యలమర్తి హేమలత శ్రీనివాసరావు, సీతంపేట సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), గారపాటి చౌదరి, ప్రజాప్రతినిధులు, నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆలయ ప్రదక్షిణ చేశారు. అమ్మవారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

క్లాప్ ఆటో డ్రైవర్లకు వారాంతపు సెలవులు అమలు చేయాలి



కమిషనర్ వెంకట కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్) : నగరపాలక సంస్థ క్లాప్ ఆటోడ్రైవర్లకు డీఎంఏ ఉత్తర్వుల ప్రకారం ఆదివారం వారాంతపు సెలవులు అమలు చేయాలని, 15 రోజుల క్యాజువల్ లీవులు అమలు చేయాలని, జాయింట్ లేబర్ కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం 9 జాతీయ, పండుగ సెలవులు అమలు చేయాలని కోరుతూ క్లాప్ డ్రైవర్ల కమిటీ శనివారం నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతిలకు వినతి పత్రం అందజేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏడాదిన్నర కాలంలో క్లాప్ డ్రైవర్లు ఒక్క రోజు కూడా సెలవు లేకుండా పని చేయాల్సి వస్తుందని అన్నారు. అనారోగ్యం, అత్యవసర పనిపై సెలవులు పెట్టినా జీతాల్లో కోత విధిస్తున్నారని తమ వినతి పత్రంలో తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జాన్ బాబు, క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.సుగుణరావు, పుష్పరాజ్ పాల్గొన్నారు.